అన్నీ అయిపోయ్యాయి. ఒక్క భార్య మెడలోని మంగళసూత్రం తప్ప. అదే పట్టుకుని ఆరుగంటలపుడు సేట్ తుకారాం నన్నూమల్, వడ్డీవ్యాపారి దుకాణం వద్దకు వచ్చాడు భావనాఋషి. అటూ ఇటూ చూసి బిడియన్తూసిలా లోనికి ప్రవేశించాడు.

'ఆవో భాయ్! ఆవో!' బైటో!' అంటున్నాడు వృద్ధ తుకారాం ఆప్యాయంగా.

ఏందుకనంటే వాళ్ళిద్దరికీ గతంలో అవినాభావ సంబంధం వుంది. భావనాఋషి అమ్మిన ప్రతి వస్తువూ తుకారాం కొన్నాడు. ధరదేముంది? ఓ పది రూపాయలు సేట్ వైపుకే మొగ్గినా అంత ధర ఆతను కాబట్టి గుట్టుగా ఇస్తున్నాడు. భావనాఋషి తీసుకుంటున్నాడు. ఇది రెండవ కంటి వాడికి తెలియదు. వాళ్ళిద్దరికే తప్ప.

నన్నూమల్ నవ్వుకుంటూ డేమోనని సందేహిస్తూ 'ఇది...తెచ్చాను.' అన్నాడు భావనాఋషి వినిపించీ వినిపించకుండా భార్యపుస్తె బయటకు తీసి.

సేట్ తుకారాం నవ్వుకోలేదు. అతగాని భావాలు 'ఆ! ఇవి మాకు మామూలే! అయితే నీకు క్రొత్త కావచ్చు!' అన్నట్టున్నాయి. పుస్తె అందుకున్నాడు. ఏదో నల్లరాతిమీద దాన్ని పెట్టి గీశాడు, గీతలు పడ్డాయి. ఆపైన ఓ సీసాలోనుండి ఏదో ద్రావకంతీసి గీతలమీద ఓచుక్క వేశాడు. కొంచెం పొగవచ్చింది. దానికేసి చూస్తున్నాడు పరీక్షగా.

భావనఋషి అతని ముఖంకేసి చూస్తున్నాడు ఊపిరి బిగపట్టి. ఆతనిమాపు న్యాయాధికారి నిర్ణయంకోసం వేచియున్న అపరాధిని పోలి వుంది. చెవులు వినడంకోసం వేచి వున్నాయి.

ముసలి తుకారాం ముఖంలో రంగులు మారుతూన్నై. పెదవి విరుచుకుంటున్నాడు. రాతిపరీక్ష తరువాత ఆ మంగళసూత్రం అటూ ఇటూ త్రిప్పి చూస్తూ తుల్యపరీక్షకు దిగాడు.

భావనాఋషికి ఓర్పు నన్నగిల్లుతుంది. మనిషి నీరసపడి పోతూన్నాడు. ముందుగా వచ్చినప్పటి తేజం నిస్తేజమైపోయింది.

'దస్ రూపియా. మాల్ అచ్ఛా నై!' అంటున్నాడు తుకారాం



'ఇంతే !' ఆశ్చర్యపడి పోతూన్నాడు భావనాఋషి.

'దేఖో ! క్యా సావ్వా !' నల్లరాయి చూపిస్తున్నాడు సేట్.

భావనా ఋషికి ఆ రాతిలో ఏముందో ఏం తెలుసు ? చూస్తున్నాడు కాబట్టి ఆ గీతలు తప్ప. నొసటిగీతనే గుర్తించలేని తను ఆ రాతిగీతనేం గుర్తించగలడు ?

ఇద్దరూ గిజిగిజిగా బేరమాడుకున్నారు. తుకారాంనే నమ్ముకున్నట్లు సౌఖ్యాలతో చెప్తున్నాడు భావనాఋషి. ఒక్క భావనా ఋషితోనే చాలా లిబరల్‌గా తను వ్యాపారం చేసుకుంటున్నట్లు చెప్తున్నాడు తుకారాం. చివరకు బేరం పంద్రెండు రూపాయలకు కుదిరిపోయింది. గల్లా తెరచి ఘల్లుమని పించాడు తుకారం.

ఇది జరిగి పది నిముషాలు కాలేదు. భావనాఋషి సారాడిపోలో సాక్షాత్కరించాడు. గ్లాసుమీద గ్లాసు కుత్తుకలవరకూ నింపుకున్నాడు. జేబులో డబ్బు నెమ్మదిగా మాయమవుతూ వుంది. కళ్లు తిరుగుతున్నై. ఏదో రాక్షసి వచ్చి మనిషిమీద కూర్చున్నట్లుంది. మత్తు ఎక్కువయింది. తను గొణుక్కుంటున్నాడు. వళ్లు తెలియడంలేదు. వూడిపోతున్న పంచె సర్దుకునేందుకు యాతనపడిపోతున్నాడు. దారినపొయ్యే దానయ్య ప్రతివాడు ఓప్పురుగులా కన్పిస్తున్నాడు. వాళ్లు తప్పుకుంటున్నారే గాని తనకు తప్పుకోవాలన్న భావనే లేదు. పెళ్లాం గుర్తుకొస్తుంది. పిల్లలు గుర్తుకొస్తున్నారు. క్షణంకాలం వాళ్ళకోసం చేతులెత్తి పైకిచూశాడు. అంతే! తరువాత అతనికేం గుర్తులేదు. చుక్క ఎక్కువైనట్లుంది. ఆ నడిరోడ్డుమీద పడిపొయ్యాడు.

ఇంటిదగ్గర భారతమ్మ భర్తకోసం ఎదురు చూస్తూంది. చంటిదానికి ఆట అమ్మ. జ్వరం కాలుతూంది. శఠగోపాలాచారి వెయ్యిచూసి వెళ్ళాడు. భర్త మందుకోసం పుస్తె తీసుకెళ్ళాడు. కాలం జాలమయింది. నిరీక్షణ నిజాన్ని తెలియజేస్తూంది. అతగాడు తప్పత్రాగే వుండాలి ఇల్లూ — ఇల్లాలు గుర్తుంటే అనుకోవలసినదేమిటి? పిల్లా — పాపలు జ్ఞప్తికొస్తే కావలసినదేమిటి ? సంసారంలో సామరస్యం లేకుండా ఎలా వుంటుంది ?

# చచ్చేందుకు రైల్లేదు

ఆమెకు కాళ్ళాడ్డంలేదు కన్నీరు పొరాడ్డం పోదు. పవిటచెంగు తడిసిపోతూంది. ఆర్ద్రమైన కంఠం విషాదాన్ని నింపుకుంటుంది.

ఇప్పటికోగాని తెప్పరిల్లిందికాదు. పిల్లవాళ్లు నేలమీదనే నిద్రపోయ్యారు. పాపం పిడికెడు తిన్నారు కారు. పెద్దవాడి ముఖం చూస్తే పెళ్లున పొంగుతుంది దుఃఖం. దుఃఖం కాదది. దవానలం.

దూరంగా కుక్కలు మొరుగుతూన్నై, గాలివాటుకు ఎవరో పాడుతూన్నపాట జీరగా విన్పిస్తుంది. మధ్యలో ఆగిపోయింది. మళ్ళీ ప్రారంభమయింది.

ఆ గొంతు ఆమెకు తెలుసు. ఆమెకు తెలుసని ఆ గొంతుకు కూడా తెలుసు. అందుకే ఇల్లు దగ్గరపడేకొద్ది శ్రుతి ఆరునొక్క రాగాని కెడుతూంది. ముఖ్యంగా ఆమె విని ఆనందించాలని, ఆనందించిన తరువాత అభినందించాలని.

'త్రాగితే తప్పేముంది?' ప్రశ్న పడుతూంది. ఆ తరువాత 'అఫ్‌కోర్సు' పత్తి అనబడుతూంది కూడా. వెంటనే ఇంటి తలుపు ఫుట్‌బాలులా ఎగిరిపడేంత పని చేస్తూంది. ఒకవేళ ఆమె నిద్రలోవుంటే ఆధ్వని చక్కని సంగీత స్వరానికి హార్మోనియం. కాకపోతే ఫిడేలు. లేదా తబలా. ఏదో ఒకటి !

ఇంట్లోకొచ్చిన భావనాఋషికి ఇల్లాలు కన్పించదు. పిల్లలు కన్పిస్తారు. తృప్తిగా వాళ్ళు నిద్రపోతున్నారుకదాని సంతృప్తి పడిపోతాడు. వండితే తింటాడు. వండకపోతే ఆవేళ రాద్ధాంతం. ఆమె కొప్పుబట్టి బయటికి లాగుతాడు. లేకపోతే తన పిల్లలకు నిద్రాభంగమౌతూంది. తను చేస్తున్న సత్కార్యం ప్రతిదీ వాళ్ళకోసమేగా మరి! ఆమె వళ్ళు హూనమౌతుంది, వళ్ళు రాలిపోతై. కళ్ళు కారిపోతై. ఇది ఆమె పూర్వజన్మలో చేసుకున్న పూజకు దక్కిన పురుష పుంగవుని ప్రతాపం. ఆనాడే కాదు. ప్రతిరోజూ, ఈనాడు కూడా ఇంతే.

ఇంతా అయిన తరువాత భావనా ఋషికి పశ్చాత్తాపం కలుగుతుంది కొట్టినందుకు కుమిలిపోతాడు. తిట్టినందుకు తెమిలి పోతాడు. బయట మూలుగుతూన్న కుత్తుకపుమీద ప్రేమ కట్టలు త్రెంచుకుంటుంది. బత్తెనికి తాను కానీ ఇవ్వలేదని అపుడు గుర్తుకొస్తుంది. మరి వుంటేగా ఇవ్వడానికి. వున్న నాలుగు డబ్బులూ వీళ్ళకే సరిపొయ్యే. మరి చోళ్ళమాటేమిటి ? అందుకే తను బలవంతంగా ఆమె వద్దంటున్నప్పటికీ తీసుకొచ్చి ఆమెతో పాటే పండుకుంటున్నాడు! పస్తు! ఆమె మాత్రం ఊరుకుంటుందా. సంవత్సరం తిరక్కముందే అంతబాధలోనూ తీసుకొస్తుంది సంతతి! పస్తు! ఆరోగ్యం క్షీణించినా ఆమెకు ఉండదు చింత. ఎందుకని? పురుషునివద్ద స్త్రీ బానిస కాబట్టి. కాళ్ళూ చేతులూ కట్టి, విననందుకు కొట్టి, తృప్తి తీరక తిట్టి అనుభవిస్తున్నాడు కాబట్టి!

సూర్యుడు తూర్పున పొడుస్తాడు. తూర్పున పొడిస్తేనే సూర్యుడౌతాడు. పడమర అస్తమిస్తాడు. వారానికి ఏడు రోజులు కోడికూస్తేనే తెల్లవార వచ్చేది. తెల్లవారితేనే అతుకుల బ్రతుకులు. బ్రతికితేనే బాకా ఊదగలిగేది. అందుకే ఆశ మానవున్ని లొంగదీస్తుంది. ఏ ఆశా లేని వారికి క్షణకాలం జీవితం ఘోరవిపత్తు.

భారతమ్మకు రైలు క్రిందకు వెళ్ళడం చాలా ఇష్టం. అయితే ఆమె కన్నెప్పి పిల్లలనబడే ప్రతిబంధకాలు ప్రతిసారీ పట్టుకుంటున్నై. వెళ్లకుండా ఆమెను నెట్టుకుంటూన్నై. ప్రతిసారీ ఒకసారి! ఒకసారి మరోసారి! ఇలానే కాలాన్ని గెంటివేయడం. కానీ ఒకసారి ఆమెకు వాయిదా అవకాశం కన్పించడం లేదు. సర్వం నాస్తిగా స్వీకరించుకుంది.

నిద్రలో పిల్లది గొణుక్కుంటుంది. ఆరుబయటి వెన్నెల విషాదాన్ని గ్రక్కుతూంది. భావనాఋషి! ఉదయార్కచాద, మాయామర్మం తెలియని పిల్లల శ్వాస నిశ్వాసాలు అతనిగురకతో మిళితమైనై.

కూడగట్టుకున్న ధైర్యంతో ఆమె లేచింది, పిల్లల తలలు నిమిరింది. మాతృహృదయం కాబట్టి నొసలు ముద్దిడింది, కనిపెంచిన కన్నతల్లి కాబట్టి. మరో జన్మలో నాకదుష్ప పండవద్దని వేడుకుంది. వాళ్ళనమ్మ తన కడుపున పుట్టవద్దని వేడుకొంది. పతియే ప్రత్యక్ష దైవంగాబట్టి భర్తపాదాలకు మ్రొక్కకుండా వుండలేకపోయింది. కన్నీళ్లతో కాళ్లు కడిగింది.

# చచ్చేందుకు రైలేదు

దేయిజన్మలకైనా విడనాడకుండా మీరే నా భర్త కావాలని. వళ్ళు జలదరించేలా 'శుభం' అని ఓదయ్యపు పిట్ట క్యారుమని ఇంటిమీదినుండి వెళ్ళిపోయింది.

చప్పుడుకాని నిశబ్దంలో ఆమె బయటి కొచ్చింది. ఇంటిమీద ప్రేమ. ఇంట్లో పిల్లలమీద ప్రేమ. పిల్లల్ని కని పెంచిన భర్తమీద ప్రేమ. ఒకటేమిటి ? లక్ష ప్రేమలు. అన్నీ ఒక్కసారే పొంగిపొర్లి వరదలై పారినై. ఆమె అవురుమంది. ఆమె హృదయం ఆవురుమంది. ముందుకు మూడంగలే వేసింది, నీకోసమే నే వచ్చానని మార్జాలం 'మ్యావ్' మంది. ఈ శుభ సమయంలోనే అశుభం. అపశకునం. అందుకని ఆమె కాస్త వెనుకాడింది, తరువాత ఇక లక్ష్యపెట్టలేదు.

ఇరుకువీధి చివరికొచ్చింది. మలుపు తిరిగితే మరుగవడి పోతూంది. తాత్కాలికంగా కాదు. శాశ్వతంగా. కానీ ఎదురుగుండా ఎవరో వస్తున్నారు. ఎవరు చెప్మా? కావమ్మత్త! తనవైపుకే వస్తుంది. ముత్తైదుకాదు ముండమోపి. అపశకునానికి మరో అపశకునం తోడయింది. దయ్యంలా వంటికి తెల్లగా కప్పుకున్న దుప్పటి కాస్త తొలగించి చూస్తుంది తన్నే.

'ఏందే పిల్లా? యీవేళప్పు డెక్కడికే?' వస్తూనే విస్తుపోతూ ప్రశ్న వేస్తూంది కావమ్మత్త.

మోసుకొస్తున్న దుఃఖాన్ని, దుర దృష్టాన్నీ రెంటినీ ఒకేసారి వొలకబోస్తూ వెక్కివెక్కి ఏడుస్తున్న భారతమ్మ.

'చావుకోసం' అని ముక్తసరిగా జవాబు చెప్పింది.

ఆమె వాక్యంలో చావు నిశ్చయం స్పష్టంగా వ్యక్తీకరింప బడింది.

'చచ్చి సాధించేదేమిటే పిచ్చిదానా ?' అందుకుంది కావమ్మత్త.

'నాచావు. కాదు నా మరణం'

'బ్రతికున్నప్పటికీ నువ్వు చావలేదా ఏమిటే ? చచ్చేవున్నావ్.'

'ఆ చావు వేరు. ఇప్పుడు నిజంగా చావ బోతూన్నాను.'

'జనం అబద్దంగా చస్తారా ఏమిటే?'

'ఏమో ! నాకు తెలియదు.'

'మరెవరికీ తెలుసు ?'

'దేవుడికి.'

'కాదు. నన్ను చెప్పమంటావా ?'

'చెప్పు.'

'కళ్ళున్నప్పటికీ గ్రుడ్డివాడై పోయిన పితండ్రికి. పితండ్రిని ప్రోత్సహించిన నీ తల్లికి'

'పొరపాటు పడుతూన్నావత్తా ! మేక వన్నె పులులుంటాయని ఎవరేం కలలు కవరు.'

'పోన్లేవే ! ఆ వాదన వదిలేద్దాం. మరి ఎలా చావాలనుకుంటున్నావ్ ?'

'రైలుక్రింద.'

'అయ్యో! నా ఖర్మ! కాదు నీఖర్మ !' నొసలు కొట్టుకుంది కావమ్మ.

'ఏమిటాఖర్మ !' విస్తుపోతూ అడిగింది భారతమ్మ.

'దరిద్రుడు తల కడగబోతే...' ఆమె కుర్మలో ఆగిపోయింది.

'ఆ !'

'మల్లెపూల వాన కురిసింది.'

'నా కర్థం కావడంలా ?'

'అర్థం కావడానికేముంది. ఎవరో దుండగులు పట్టాలకున్న ఫిష్ప్లేట్లు తొలగించార్ట.'

'అయితే!' ఆమె ఆత్రుతగా అడిగింది.

'అయితే కాయా గియితేలేదు. వస్తూన్న రైలు కాస్తా పడిపోయింది. పట్టాలు బాగు చేసేంతవరకూ మరో రైలు రాదు. అందుకే నే తిరిగొస్తున్నా నగరం !'

భారతమ్మను అడ్డుకుంటూ వెనక్కు తిప్పింది కావమ్మత్త !

మరి చచ్చేందుకు రైల్లేదు ! ●

